ఫ్రీహోల్డు అయ్యేనా..?

ఫ్రీహోల్డు పేరుతో పేదల భూముల స్వాహా

- తిరిగి దక్కించుకోవడంపై పేద రైతుల ఆశలు
- కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం

భూములు కొట్టేసిన వారిపై చర్యలు ఏవీ?

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డు పేరుతో వైసీపీ నాయకులు, వారి అనుచరులు జిల్లాలో తరతరాలుగా చిన్న, సన్నకారు, పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములను కాజేశారు. అసైన్డు వ్యవసాయ భూములను ఫ్రీహోల్డు చేస్తే రైతులకు పూర్తి హక్కులు వచ్చి విక్రయించుకోవచ్చంటూ మభ్య పెట్టి, వైసీపీ నాయకులు భూములను అప్పనంగా కాజేశారు. జిల్లాలో 2,57,042ఎకరాల భూమిని 22ఎ జాబితా నుంచి తొలగించి, ఫ్రీహోల్డు భూములుగా చేశారు. ఇందులో 1,26,215 ఎకరాల అసైన్డు భూమి ఉంది. ఫ్రీహోల్డు తరువాత జిల్లాలోని 32 మండలాల్లోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 5,242 ఎకరాల భూములను రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో 2,141 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ చేసినట్లు అధికారులు గుర్తించారు. 2003 సంవత్సరానికి ముందు ప్రభుత్వం పట్టాలుగా ఇచ్చిన అసైన్డు భూములను మాత్రమే ఫ్రీహోల్డు చేస్తామని అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికి పలుచోట్ల రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులతో కుమ్మక్కై 2003 తరువాత పట్టాలిచ్చిన భూములను కూడా ఫ్రీహోల్డు చేసి స్వాహాకు సహకరించారు.





కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు

పక్కా ప్లాన్‌తో...

జిల్లాలో వైసీపీ నాయకులు పక్కా ప్రణాళికతోనే ఫ్రీహోల్డు చేసిన పేదల భూములను కాజేశారు. అసైన్డు భూములు, 22ఎ జాబితాలోని భూములను ఫ్రీహోల్డు చేస్తున్నట్లు అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలు ముందుగానే అనుచరులు, నాయకులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అసైన్డు భూములు సాగుచేసుకుంటున్న రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకే కొనుగోలు చేశారు. వైసీపీ ప్రభుత్వం భూముల ఫ్రీహోల్డు ప్రకటనకు కొన్నినెలల ముందుగానే జిల్లాలో అనేక చోట్ల వైసీపీ నాయకులు అసైన్డు భూములున్న రైతులతో ముందస్తు విక్రయ ఒప్పందాలు చేసుకున్నారు. ఎకరా రూ.కోటి విలువ చేస్తే భూమిని రూ.10లక్షల నుంచి 15లక్షలు ఇచ్చి, రాయించుకున్నారు. ఫ్రీహోల్డు చేసిన తరువాత చాలమంది రైతులను బెదిరించి, బలవంతపెట్టి, ఆశచూపి వారి భూములను కొట్టేశారు. తమ అసైన్డు భూములను ప్రభుత్వం ఫ్రీహోల్డు చేస్తుందని తెలియని అనేకమంది రైతులు వైసీపీ నాయకుల చేతుల్లో ఘోరంగా మోసపోయారు.


విక్రయించిన పొలంలో కరంతోటి సింగేనాయక్, లక్ష్మిబాయి

కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశాం

మా తల్లిదండ్రులు కరంతోటి కెమినీబాయి, పోమేనాయక్‌కు 1974లో పుట్టపర్తి మండలంలోని వెంగళమ్మ చెరువు గ్రామ పొలం సర్వేనెంబర్ 581/1లో అప్పటి ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని డిపట్టాగా ఇచ్చింది. మా తల్లిదండ్రులకు మేముఏడుగురు సంతానం. మాతల్లిదండ్రులు చనిపోయిన తరువాత ఉపాధి కోసం ఆరుగురు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాం. గ్రామంలోనే ఉంటూ ఐదు ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్న మాచెల్లెలు లాలీబాయి మాకు తెలియకుండా స్థానిక రెవెన్యూ అధికారుల అండతో తనపేరుపై వన్‌బీ అడంగల్ తెచ్చుకుంది. వైసీపీ ప్రభుత్వం ఈభూమిని ఫ్రీహోల్డుగా ప్రకటించ డంతో పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించి, బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఏడాది జూన్ 12న రిజిస్ట్రేషన్ చేయించింది. ఐదెకరాల భూమికి ఏడుగురు వారసులుండగా, ఒకరితోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో మేమంతా గత డిసెంబరు 30న గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అలాగే ఎస్పీ రత్నను క లిసి ఫిర్యాదు చేశాం. అయినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

- కరంతోటి సింగేనాయక్, లక్ష్మిబాయి, కొండకింద తండా, నల్లమాడ మండలం

కేటుగాళ్లపై చర్యలేవీ?

జిల్లాలో ఫ్రీహోల్డు ముసుగులో పేద రైతుల భూములు కాజేసిన కేటుగాళ్లపై ప్రభుత్వం నేటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పేద రైతుల భూములు కొట్టేసిన వైసీపీ నాయకులు దర్జాగా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఫ్రీహోల్డు భూముల అక్రమాలపై విచారణకు ఆదేశించడంతో మోసపోయిన పలువురు రైతులు తమ భూములు తిరిగి తమకు దక్కుతాయని ఎంతో సంతోషపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు దాటినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధిత రైతులు ఉసూరుమంటున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం

ఫ్రీహోల్డు అసైన్డు భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ కొనసాగుతోంది. విచారణ పూర్తి అయిన తరువాత ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. బాధితులుంటే నన్ను వ్యక్తిగతంగా కలిసి ఫిర్యాదు చేయవచ్చు.

-సువర్ణ, ఆర్డీఓ, పుట్టపర్తి

వార్తల్లో వాస్తవాలు ఉండాలి

- అప్పుడే ప్రజలకు ఉపయుక్తం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- ధర్మవరంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు రాసే వార్తలు వాస్తవరూపంలో ఉండాలని, అప్పుడే అవి ప్రజలకు ఉపయోగపడతాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరంలో గురువారం నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వారి సంక్షేమం కోసం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. జర్నలిస్టులకు హెల్త్‌స్కీం అమలు చేస్తున్నామని, ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలోకి చేర్చే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించామని అన్నారు. రైల్వే పాసుల సమస్యను కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. అక్రెడిటేషన్ సమస్యను మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

అక్రమ కేసులను ఎత్తేయండి: ఐవీ సుబ్బారావు

గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తగిన గౌరవం, గుర్తింపు దక్కుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. కొత్త అక్రెడిటేషన్లు ఇచ్చేలా వెంటనే జీఓను జారీ చేయాలని కోరారు. హెల్త్‌కార్డులు ఉన్నా.. చాలా ఆస్పత్రులలో వైద్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పుట్టపర్తి, ధర్మవరంలో విలేకరులకు ఇంటి స్థలాలు లేవని, వెంటనే ఇవ్వాలని కోరారు. ధర్మవరంలో జర్నలిస్టుల కాలనీకి పునాది వేయాలని మంత్రిని కోరారు. పుట్టపర్తి, ధర్మవరంలో ప్రెస్‌క్లబ్‌ల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని మంత్రిని కోరగా, కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యల నడుమ జర్నలిస్టులు: పరిటాల శ్రీరామ్

వ్యవస్థలను గాడిలో పెట్టే సామర్థ్యం మీడియా రంగానికి ఉందని, కానీ అందులో పనిచేస్తున్న జర్నలిస్టులు సమస్యల నడుమ ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యల పరిష్కారం కోసం గట్టిగా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాలలో విలేకరులకు ఇంటి స్థలాలు ఇస్తామని, ఇళ్ల నిర్మించి ఇస్తామని అన్నారు. ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ కమిటీ సంక్షేమానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు.

అండగా ఉంటాం: చిలకం

జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. వారి సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికితీసుకెళ్లి, తగిన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు పాటుపడుతున్నారని అన్నారు. అవినీతి అక్రమాలను వెలికితీయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, ఏపీయూడబ్ల్యూజే అనంతపురం, కర్నూలు జిల్లాల అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్, రాజు, శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి బాబు, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు జీవీ నారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ అధ్యక్షులు జానపాటి మోహన్, ప్రధానకార్యదర్శి జాంపుల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో పూర్తి చేయండి

కలెక్టర్ టీఎస్ చేతన్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పెడింగ్ పనులను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ పంచాయతీ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ సక్రమంగా జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పౌరుల డేటా పురోగతి మెరుగుపడాలని, లేదంటే ఎంపీడీఓలకు మెమో జారీ చేస్తామని హెచ్చరించారు. తనకల్లు మండలంలో 2,193 రికార్డులు పెండిగ్‌లో ఉన్నాయని అన్నారు. కనగానపల్లి, పరిగి మండలాల్లో పౌరుల డేటా సేకరణ మెరుగుపడాలని అన్నారు. హిందూపురం అర్బన్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులు ఉన్న పౌరుల డేటా ఎక్కువగా ఉందని, ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించారు. 0 నుంచి 5 సంవత్సరాల వయసు పిల్లలకు ఆధార్ నమోదు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తప్పకుండా బయోమెట్రిక్ హాజరు వేయాలని సూచించారు. ఈ నెల 15న జిల్లాలోని ఎంపీడీఓలు గ్రామ పంచాయతీ స్థాయిలో చెత్త నుంచి సంపద తయారీ షెడ్ల ఏర్పాటు గురించి పౌరులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో తడి, పొడిచెత్త వేయడానికి డస్ట్ బిన్‌లను అదించాలని ఆదేశించారు. పాఠశాలలు, ఆసుపత్రులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సమీక్షలో డీ పీఓ సమత, జడ్పీ డిప్యూటీ సీఇఓ వెంకటసుబ్బయ్య, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, చేనేత శాఖ ఏడీ రామక్రిష్ణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జున పాల్గొన్నారు.

గుండెకు భరోసా..!

- ప్రాణదాత.. స్టెమీ ఇంజెక్షన్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా రూ.40 వేల సూది
- గుండెపోటు మరణాలు తగ్గించేందుకు ప్రణాళిక



కొత్తచెరువు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మనిషి ప్రాణాలకు అత్యంత ప్రమాదకరమైనది గుండెపోటు. ఒక్కొక్కసారి నిమిషాల్లోనే ప్రాణాలు తీసేస్తుంది. ప్రస్తుతం చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ గుండె సంబంధిత జబ్బులు కలవర పెడుతున్నాయి. గతంలో కాస్త వయసు పైబడినవారికి గుండెజబ్బులు వచ్చేవి. ప్రస్తుత ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల వల్ల వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురవుతున్నారు. ఒక్కసారిగా వచ్చే గుండెపోటుకు తక్షణ వైద్యం అందక ఎందరో ప్రాణాలను కోల్పోతున్నారు. గుండెపోటు వచ్చినపుడు గంటల వ్యవధిలో స్టెమి ఇంజెక్షన్ ఇస్తే రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. ఆ ఇంజెక్షన్ ఖరీదు రూ.40 నుంచి 45 వేలు ఉంటుంది. ఇది ఖర్చుతో కూడిన వ్యవహారం. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక సమస్యల కారణంగా సరైన సమయంలో వైద్యం అందక మరణించేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గుండెపోటుకు గురయ్యే వారి ప్రాణాలను కాపాడాలన్న లక్ష్యంతో ఖరీదైన స్టెమీ (ఎస్‌టి ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) ఇంజెక్షన్ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండేలా ప్రణాళికలను రూపొందిస్తోంది. ఈ ఇంజెక్షన్ అందుబాటులోకి రావడం వల్ల గుండెపోటుకు గురైన రోగికి వైద్యపరీక్షలు నిర్వహించి తక్షణం ప్రాణాలను కాపాడవచ్చునని వైద్యులు చెబుతున్నారు. కొత్తచెరువు సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో ఈ సూది మందు అందుబాటులో ఉందని ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్వత్థబాబు తెలిపారు.

పేదలకు వెసులుబాటు



ఇటీవల కాలంలో కొత్తచెరువు మండలంలో చాలామంది గుండెపోటుకు లోనై తక్షణ వైద్యసేవలు అందక మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆర్థిక ఇబ్బందుతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక మృతి చెందారు. పేదలు అప్పటికప్పుడు డబ్బు సమకూర్చుకోవడం కష్టం. దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం గుండెనొప్పికి గురైన వారిని కాపాడేందుకు రూ.40 నుంచి 45 వేల విలువచేసే స్టెమీ ఇంజెక్షన్ ఉచితంగా అందుబాటులోకి తీసుకు రావడం గొప్ప వరం. పేదల గుండెకు భరోసాతోపాటు, ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది.

- అడపాల రామకృష్ణ, కణిశెట్టిపల్లి

తొలి గంటే కీలకం




గుండెనొప్పి వచ్చినవారికి తొలి గంటే ఎంతో కీలకమైనది. దాన్నే గోల్డెన్ అవర్ అంటారు. చాతిలో నొప్పి, ఆకస్మికంగా ఆయాసం, గండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు గుండెనొప్పికి సంకేతాలు. ఈ లక్షణాలు కనిపించిన మరుక్షణమే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలి. డాక్టర్లు పరీక్షించి గుండెనొప్పిగా నిర్ధారణ అయితే వెంటనే స్టెమీ(టెనెక్టిప్లస్)ఇంజెక్షన్ ఉచితంగా వేస్తారు. ఈ ఇంజెక్షన్ వేయడం వల్ల రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది. దీంతో రోగికి మెరుగైన వైద్యం అందిచేందుకు తగిన సమయం లభిస్తుంది.

- డాక్టర్ అశ్వత్థకుమార్, మెడికల్ ఆఫీసర్, కొత్తచెరువు


రాగిరి రామయ్య సస్పెన్షన్

వివరాలు 7లో...

బోగస్ పట్టాల దందా


గత తహసీల్దార్ సంతకాలతో ఉన్న బోగస్ పట్టా

- పెనుకొండలో దళారుల ఇష్టారాజ్యం
- ఫోర్జరీ సంతకాలతో పట్టాలు
- యథేచ్ఛగా నిర్మాణాలు
- చోద్యంచూస్తున్న అధికారులు



పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో పట్టణ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఇంటి అద్దెలు సైతం అమాంతం పెరిగిపోయాయి. దీనిని క్యాష్ చేసుకునేందుకు దళారులు రంగంలోకి దిగారు. బోగస్ పట్టాల దందా సాగిస్తున్నారు. ప్రభుత్వ స్థలం ఇప్పిస్తామంటూ ప్రజలను నమ్మబలుకుతున్నారు. బదిలీపై వెళ్లిపోయిన అధికారుల ఫోర్జరీ సంతకాలతో పట్టాలు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మడకశిర రోడ్డులో వైద్య కళాశాల, దాని ఎదురుగా పదెకరాల్లో అహుడా లేఅవుట్ వేయడంతో అక్కడ భూములకు డిమాండ్ పెరిగిం ది. దీంతో సమీపంలోని ప్రభుత్వ భూ ములకు బోగస్ పట్టాలు విపరీతంగా పుట్టుకొచ్చాయి. జగనన్న లేఅవుట్, జర్నలిస్టు కాలనీలో బోగస్ పట్టాలతో యథేచ్ఛగా నిర్మాణాలు దీంతో అసలైన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. బోగస్ పట్టాల వ్యవహారం రెవెన్యూ అధికారులకు తెలిసినా చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జర్నలిస్టు కాలనీ, జగనన్న లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలను అడ్డుకుని చర్యలు తీసుకోవాలని అసలైన లబ్ధిదారులు కోరుతున్నారు.

బోగస్ పట్టాలతో నిర్మాణాలు

జగనన్న లేఅవుట్‌లో ప్రజా అవసరాల కోసం వదిలిన ఖాళీ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. ఇక్కడి నుంచి బదిలీ అయిన అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఆ స్థలానికి బోగస్ పట్టాలు చేయించుకున్నారని తెలుస్తోంది. వెంటనే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పెనుకొండ తహసీల్దార్‌గా గతంలో పనిచేసిన ఓ మహిళా అధికారి పలువురికి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఆమె బదిలీ అయ్యాక ఆమె ఫోర్జరీ సంతకాలతో బోగస్ పట్టాలు సృష్టించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


పట్టా ఉన్నా నిర్మాణాన్ని తొలగిస్తున్నారంటున్న బాధితుడు (ఫైల్)

దళారులను నమ్మి మోసపోకండి



ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామనే దళారులను నమ్మి మోసపోకండి. నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకుంటే ఇంటి పట్టా అందజేస్తాం. బోగస్ పట్టాలతో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు.

-ఆనంద్‌కుమార్, ఆర్డీఓ, పెనుకొండ

వైసీపీ పాపం..!

• పాల సేకరణ కేంద్రం మూత • పాడి రైతులకు అందని బకాయిలు



మూతపడిన పాల సేకరణ కేంద్రం

గత వైసీపీ పాలకుల పాపం.. పాడి రైతులకు శాపంగా మారింది. పట్టణ పరిధిలోని పాల సేకరణ కేంద్రాన్ని ఉన్నఫలంగా మూత వేయడంతో పాడి రైతులకు బకాయిలు అందకుండా పోయాయి. ఏకంగా రూ.17 లక్షలు చెల్లించాల్సి ఉందని పాడి రైతులు వాపోతున్నారు. ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామంటూ వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా చెల్లించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, రాయదుర్గం రూరల్

టీడీపీ హయాంలో ఏర్పాటు

వ్యవసాయంలో నష్టాలు రావడంతో చాలా మంది రైతులు ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ వైపు మొగ్గారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పాడి రైతులకు బాసటగా నిలవాలని రాయదుర్గంలో పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించింది. రాయదుర్గం మండలంలోని డీ కొండాపురం, బీఎన్‌హళ్లి, బొమ్మక్కపల్లి, వడ్రవన్నూరు, రేకులకుంట, రాయంపల్లి, గుమ్మఘట్ట మండలంలోని గలగల, గొల్లపల్లి, కలుగోడు, బేలోడు, నేత్రపల్లి, డీ.హీరేహాళ్ మండలంలోని గొడిశలపల్లి, హనుమాపురం, ఎస్‌ఆర్ కోట గ్రామాల నుంచి పాలను సేకరిస్తుండేవారు. 100 లీటర్లతో ప్రారంభమైన పాల సేకరణ కేంద్రం.. మూడు వేల లీటర్ల స్థాయికి చేరింది. రైతుల నుంచి పాలను సేకరిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు కూడా చెల్లిస్తూ ఉండేది. తద్వారా రైతులు లాభాలు గడిస్తుండేవారు.

వైసీపీ రాకతో మూత

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పాల సేకరణ కేంద్రానికి గడ్డుకాలం మొదలైంది. డెయిరీని ప్రైవేటు పరం చేయడంతో 2020లో ఏకంగా మూత వేశారు. దీంతో పాడి రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రైవేటు డెయిరీలకు పాలను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డెయిరీలు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పాల సేకరణ కేంద్రం మూత వేసేనాటికి నియోజకవర్గంలో 210 మంది రైతులకు రూ.17 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బిల్లుల కోసం పాడి రైతులు.. వెలుగు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. బకాయి బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన గత వైసీపీ పాలకులు.. ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు.

తుప్పుపట్టిన పరికరాలు

పాల సేకరణ కేంద్రాన్ని మూత వేయడంతో అందులోని పరికరాలు తుప్పు పడుతున్నాయి. కాలర్ కంప్రైజర్ యంత్రాలు, ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. సామగ్రి తుప్పు పట్టింది. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది.

రూ.లక్ష బకాయిలు రావాలి



గతంలో డెయిరీకి పాలను విక్రయించేవాడిని. బిల్లు రూ.లక్షదాకా రావాల్సి ఉంది. డెయిరీ మూతతో ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ధరలు, డిమాండ్‌ను బట్టి మారుతుంటాయి. విధి లేని పరిస్థితిల్లో వారు చెల్లించిన బిల్లులను తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వ పాలకేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

-తిమ్మరాజు, పాడి రైతు, బీఎన్ హళ్లి

పాల కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి



టీడీపీ పాలనలో ప్రభుత్వమే డెయిరీలను ప్రారంభించి, రైతుల నుంచి పాలను సేకరించేది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాల సేకరణ కేంద్రాన్ని మూత వేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాల బిల్లుల కోసం రైతులు.. కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయారు. కూటమి ప్రభుత్వమైనా పాడి రైతుల కష్టాలను గమనించి, పాల కేంద్రాలను ప్రారంభించాలి.

-తిప్పేస్వామి, రైతు కూలీ సంఘం నియోజకవర్గ కార్యదర్శి

అరణ్యం.. కాపాడుకోవడమే శరణ్యం

ప్రత్యేక కార్యాచరణ
తరచూ అటవీ ప్రాంతంలోకి వెళ్లేవారి వివరాల నమోదు
ఏటా మంటలు చెలరేగే ప్రాంతాల గుర్తింపు
నివారణ చర్యలపై స్థానికులకు అవగాహన
కంట్రోల్ బర్నింగ్ ద్వారా నష్ట నివారణ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముందుగానే కరువు జిల్లా. వర్షపాతం తక్కువ. పచ్చని పైర్లు కనిపించేదీ అరుదు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ఉన్న మార్గం అడవులు. అటవీ ప్రాంతాన్ని కాపాడుకుంటేనే మనుగడ సాధ్యమన్నది నిర్వివాదాంశం. వేసవి ప్రారంభమవడంతో అడవులకు అగ్ని ప్రమాదాల ముప్పు పొంచి ఉంది. మండే ఎండలకు మంటలు చెలరేగే అవకాశం ఉంది. అదే జరిగితే పచ్చని చెట్లు అగ్నికి ఆహుతవడంతో వన్యప్రాణాలు మాడి మసైపోతాయి. ఈ నేపథ్యంలో అగ్ని నుంచి అడవిని కాపాడటం అటవీశాఖ సిబ్బందికి సవాల్‌గా మారింది. ఏడాదిపాటు కాపాడిన అడవి వేసవిలో రాత్రికి రాత్రే మాడి మసైపోతుంది. అగ్ని నుంచి అడవుల పరిరక్షణకు

నూతన చర్యలు

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించి, ఏ సమయంలో అడవిలో అగ్గిపడినా సహకారం అందించేలా వారికి బాధ్యతలు అప్పగిస్తున్నారు. గ్రామాల నుంచి ఏ దారి వెంబడి స్థానికులు అడవిలోకి వెళ్తున్నారు, తిరిగి ఎలా వస్తున్నారన్న వివరాలను అటవీశాఖ సిబ్బంది ద్వారా నమోదు చేయిస్తున్నారు. సమీప ప్రదేశాల్లో మంటలు చెలరేగితే అడవిలోకి వెళ్లే స్థానికులను కూడా బాధ్యులను చేస్తూ అదుపు చేసేలా తగిన చర్యలు చేపడుతున్నారు. మంటలు ఎలా పడ్డాయన్న దానిపై రిజిస్టర్‌లో నమోదు చేసిన వారిని పిలిపించి, విచారణ చేయనున్నారు. ఇందులో వారి తప్పు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు చేపట్టి, కటకటాల పాలు చేయనున్నారు. ఈ చర్యల ద్వారా అగ్గి నుంచి అడవిని కొంతవరకైనా కాపాడుకునే వెసులుబాటు ఉంటుందని డీఎఫ్‌ఓ చెప్పుకొస్తున్నారు.



మంటలను అదుపు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఫైల్)

జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్‌ఓ) విఘ్నేష్ నూతన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. జిల్లాలో ఏటా అగ్ని ఎక్కడెక్కడ పడుతుంది, ఫైర్ వాల్స్ ఎక్కడన్నది సిబ్బంది ద్వారా గుర్తించి, రికార్డులు తయారు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టి మంటలను అదుపు చేయాలని భావిస్తునానరు. మంటలు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

మంటల అదుపునకు..

అడవిలో మంటలు ఏర్పడితే వాటిని అదుపు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏటా మంటలు చెలరేగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఆ ప్రదేశంలో మళ్లీ అగ్గి పడినా పక్క ప్రాంతాలకు పాకకుండా కంట్రోల్ చేసేలా శుభ్రం చేయిస్తునానరు. మరి ఎంతవరకు ఫలితాలు సాధిస్తారన్నది తెలియాలంటే వేచిచూడాల్సిందే..

ప్రత్యేక చర్యలతో అడవిని కాపాడుతాం



కంట్రోల్ బర్నింగ్ విధానం ద్వారా అగ్గి నుంచి అడవిని కాపాడవచ్చు. అందుకు అనుగుణంగా జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఫైర్ వాల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తున్నాం. అక్కడ కంట్రోల్ బర్నింగ్‌కు తగిన చర్యలు చేపట్టి, పక్క ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటాం.

- విఘ్నేశ్, జిల్లా అటవీ శాఖాధికారి

పాత సరుకు.. కొత్త ధరకు..

మద్యం షాపుల్లో అదనపు వసూళ్లు
పాత స్టాక్ పెంచిన రేట్లతో విక్రయాలు
మందుబాబుల జేబులకు చిల్లు
కనిపించని ధరల పట్టిక
కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మద్యం ధరల పెంపును పలు షాపుల నిర్వాహకులు అడ్డాదిడ్డంగా సొమ్ము చేసుకుంటున్నారు. అదనపు వసూళ్లకు దిగుతున్నారు. క్వార్టర్‌తో పాటు హాఫ్, ఫుల్ బాటిళ్ల ధరలను రూ.10 చొప్పున ప్రభుత్వం పెంచింది. రూ.99 రకం మద్యం బాటిల్, బీర్ల ధరలను యథాతథంగా ఉంచింది. ఇదివరకే మద్యం దుకాణదారులు కొనుగోలు చేసిన మద్యాన్ని పాత ధరకే విక్రయించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా జిల్లాలోని కొన్ని మద్యం దుకాణాల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. నిబంధనల మేరకు మద్యం ధర పెరిగినరోజే కొత్త మద్యం ధరల పట్టికను మద్యం షాపుల వద్ద ప్రదర్శించాలి. ఎక్కడా అవి కనిపించకపోవడం గమనార్హం.

పెంచిన ధరలతో విక్రయాలు

జిల్లాలో 136 ప్రైవేటు మద్యం దుకాణాలున్నాయి. 19 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. మూడు రోజులుగా జిల్లాలోని అన్ని మద్యం దుకాణాల్లో పాత స్టాక్‌ను కొత్త ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనల మేరకు ఐఎంఎల్ డిపో నుంచి ఇదివరకు పాత ధరలకు కొనుగోలు చేసిన మద్యాన్ని అవే రేట్లతో విక్రయించాల్సి ఉంది. మద్యం దుకాణాల్లో పాత సరుకునే పెంచిన ధరతోనే విక్రయిస్తుండటం గమనార్హం. క్వార్టర్‌తోపాటు హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున పెంచారు. అనంతపురం నగరంతోపాటు జిల్లాలోని ఇతర మండలాల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.10 లెక్కను చూపుతూ హాఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.30 అదనంగా వసూలు చేస్తుండడం గమనార్హం. అనంతపురం నగర శివారులోని దుకాణాలు, పలు సర్కిళ్లలో రూ.99 మద్యం బాటిల్‌ను రూ.110కి విక్రయించడం విశేషం. వాస్తవానికి రూ.99 మద్యం బాటిల్ ధరను ప్రభుత్వం పెంచలేదు. అయినా అన్ని రకాల బ్రాండ్ల మద్యం ధరలు పెంచారం టూ ఆ రకంపైనా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. పలు మండల కేంద్రాల్లో బీర్లపైనా అదనంగా రూ.20 వసూలు చేస్తున్నట్లు సమాచారం.



మద్యం షాపు వద్ద కనిపించని కొత్త ధరల పట్టిక

అదనంగా వసూలు చేస్తే చర్యలు

ప్రభుత్వం క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున పెంచింది. బీర్లు, రూ.99 రకం మద్యం బాటిల్ ధరలు పెంచలేదు. ఇదివరకే మద్యం దుకాణదారులు కొనుగోలు చేసిన పాత సరుకును అదే ధరకే విక్రయించాలి. ధరలు పెంచిన తర్వాత ఐఎంఎల్ డిపో నుంచి కొనుగోలు చేసిన మద్యం బాటిళ్లను మాత్రమే పెంచిన ధరకు విక్రయించాలి. అన్ని షాపుల వద్ద బ్రాండ్ల వారీగా పెంచిన ధరలు ప్రదర్శించాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఎమ్మార్పీపై అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

-రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కన్నెత్తి చూడని ఎక్సైజ్ యంత్రాంగం

మద్యం షాపుల్లో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం తప్ప.. క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. మద్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాత సరుకును కొత్త ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున మాత్రమే ప్రభుత్వం పెంచిందనీ, ఆ మేరకు కొత్త ధరలు అమలయ్యేలా చూడాలన్నారు. అన్ని మద్యం దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులుగా నిబంధనలు అతిక్రమించి అదనపు ధరలకు మద్యం విక్రయిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసిన పాపాన పోలేదు.

జిల్లాకు పతకాల పంట

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ అనంత

జట్టుకు ఘన సత్కారం



రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట పండింది. రాజధాని అమరావతి సమీపంలోని మంగళగిరి స్టేడియంలో నాలుగు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2025కు 13 ఉమ్మడి జిల్లాల పారా అథ్లెట్లు ప్రాతినిథ్యం వహించారు. ఇందులో జిల్లా అథ్లెట్లు అత్యధికంగా 43 పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. వాటిలో 20 బంగారు, 19 రజత, 11 కాంస్య పతకాలున్నాయి. విజేతలను గురువారం స్థానిక అశోక్ నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్‌కుమార్, మీనాక్షమ్మ ఫౌండేషన్ రవికాంత్ రమణ పతకాలు, సర్టిఫికెట్లు, టీ షర్టులు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాయిసంస్థ విజయసాయి కుమార్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఆరుగురి ఎంపిక



సాకే బాబు, సహన, అల్లావలి, వెంకటేష్, పల్లవి, సంజయ్‌రెడ్డి

చెన్నైలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించే జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీలకు జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. వారిలో సాకే బాబు, సహన, అల్లావలి, వెంకటేష్, పల్లవి, సంజయ్‌రెడ్డి ఉన్నారు. వారిని పలువురు అభినందించారు.

జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం కార్యకవర్గం ఎన్నిక



నూతన జిల్లా కమిటీ సభ్యులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండలంలోని రాచానపల్లిలోని యేసుకృపా మందిరంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పాస్టర్ నెహెమ్యా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ మార్కు, కార్యదర్శిగా ఆనంద్, సహాయ కార్యదర్శిగా మనషే, కోశాధికారిగా జీవన్‌బాబు, ఈసీ మెంబర్లుగా జహంగీర్ జాషువా, లాబాన్ సుధాకర్, విజయ్‌సింహ, చార్లెస్ నాయక్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో షాలేమ్ రాజు, బండెల రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్



దివ్యాంగుడి సమస్యను వింటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తాడిమర్రి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండంలోని మరువపల్లిలో గురువారం 87 మంది రైతులకు మంతిర ట్రాన్స్‌పార్మర్ల పంపిణీకి సంబంధించి ఉత్తర్వులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకుని, గృహ అవసరాలను విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద రైతులు పొలాల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని వ్యవసాయ మోటార్లకు కూడా విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. ఆ తరువాత శివంపల్లిలో కోకో కోలా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటు, ఆర్వో ఏటీఎంను మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో జల్‌జీవన్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు అలాగే ఉండిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజురు చేసి పని ప్రారంభించిందన్నారు. ప్రతిఇంటికి కొళాయి ఏర్పాటుచేసి, తాగునీరు అందిస్తామన్నారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ కూచి రాము, నాయకులు పాల్గొన్నారు

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి

అధికారులకు మంత్రి సవిత ఆదేశం



అధికారులతో సమావేశమైన మంత్రి

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గురువారం నియోజకవర్గస్థాయి అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కూటమి పాలనలో ఇచ్చిన వాటితోపాటు ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్నామన్నారు. వాటిని ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

రాయల జయంతికి ఆహ్వానం

ఈనెల 16న పెనుకొండలో నిర్వహించే శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవానికి రావాలని మంత్రి సవితకు బలిజ సంఘం ప్రతినిధులు ఆహ్వానపత్రికను అందించారు. అనంతరం ఆగస్టులో ప్రభుత్వం తరఫున కృష్ణదేవరాయల పట్టాభిషేక ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గుట్టూరు సూరి, పూల శీనా, కల్యాణ్ పాల్గొన్నారు.

మత్స్యకార లైసెన్స్ ఇవ్వాలి

గొల్లపల్లి రిజర్వాయర్‌పై లైసెన్స్ సిస్టం ఏర్పాటుచేసి, తమకు లైసెన్స్ మంజూరు చేయాలని మంత్రి సవితను గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ మత్స్యకారులు కోరారు. వారు మాట్లాడుతూ.. గొల్లపల్లి రిజర్వాయర్‌కు తమ పొలాలు తీసుకున్నారన్నారు. అప్పట్లో పరిహారం తక్కువగా ఇచ్చారన్నారు. చేపలవేటే తమకు జీవనాధారమనీ, లైసెన్స్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిల్లల్లారా.. పిడుగుల్లారా.. రారండోయ్..

నేటి నుంచి పిల్లల పండుగ.. అనంత బాలోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పిల్లలు చేసే అల్లరి, డ్యాన్సులు, కళా ప్రదర్శనలు.. అవన్నీ కళ్లారా చూస్తేనే.. తనివీతారా ఆస్వాదిస్తేనే తప్ప.. మాటల్లో వర్ణించలేం. అలాంటి ఆనందాల పండుగకు వేళయింది. పిల్లల పండుగ (అనంత బాలోత్సవం-2025) కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్‌లో అనంత బాలోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సాయంత్రం బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, సహాయ కార్యదర్శి సావిత్రి పరిశీలించారు. షమీమ్ షఫివుల్లా మాట్లాడుతూ.. 14, 15, 16 తేదీల్లో నిర్వహించే బాలోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పిల్లల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారిలో మానసికోల్లాసం పెంపొందించేందుకు ఈ ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. బాలోత్సవాల్లో పాల్గొనేందుకు పాఠశాలలవారీగా ఈ సారి పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరచని వారికి బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సహాయ కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ... విద్యార్థులు ఆటపాటలు, కళాసాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడంవల్ల వారిలో ఉత్తేజం పెరుగుతుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 10వేల మంది విద్యార్థులు బాలోత్సవాల్లో పాల్గొననున్నారన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు శ్యామలమ్మ, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని పాల్గొన్నారు.

పది ప్రీ ఫైనల్ గణిత పరీక్ష సమయం మార్పు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ నేపథ్యంలో ఈనెల 15వ తేదీన నిర్వహించే పదో తరగతి గణితం ప్రీ ఫైనల్ పరీక్షల సమయాన్ని మార్పు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి 11.45 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రశ్నపత్రాలను మండల విద్యాశాఖాధికారులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరీక్ష సమయానికి గంట ముందు 7.30 గంటలకు పంపిణీ చేయాలని ఆదేశించారు.

సేవాఘడ్‌లో ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు సంత్ సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు



అలంకరణలో సేవాలాల్ మహారాజ్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లిలోని బంజారాల పవిత్ర పుణ్యక్షేత్రం సేవాఘడ్‌లో గురువారం 286 జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతాజగదాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు చేశారు. ఉత్సవమూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. స్వామివారికి శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రికి వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్దఎత్తున తరలివస్తారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి గుర్రంపై ఊరేగిస్తారు. మాల ధరించిన భక్తులు ఇరుముడి సమర్పిస్తారు. శనివారం మాతాజగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అత్యంత కీలకమైన మహాభోగ్ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తారు. దీంతో జయంత్యుత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు జగన్నాథరావు, అశ్వత్థనాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి అతిరుద్ర మహాయజ్ఞం

పుట్టపర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలో శుక్రవారం నుంచి విశ్వశాంతి కోరుతూ అతిరుద్ర మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం సాయి కుల్వంత్ సభామండపంలో ఏర్పాట్లు చేపట్టారు. 11 హోమ గుండాలను సిద్ధం చేశారు. సత్యసాయి బాబా శత జయంతి మహోత్సవాలు ఈ ఏడాది నవంబరులో జరగనున్నాయి. అందులో భాగంగానే అతిరుద్ర మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. యజ్ఞంలో వంద మందికిపైగా పండితులు పాల్గొననున్నారు. భక్తుల కోసం ప్రశాంతి నిలయంలో ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలువురు యజ్ఞంలో పాల్గొనడానికి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. 12 రోజులపాటు యజ్ఞం కొనసాగనుంది.

త్వరలో కుడి కాలువకు నీరు బంద్..?

పీఏబీఆర్‌లో తగ్గిన నీటి మట్టం

తాగునీటి అవసరాలకు నిల్వ


పీఏబీఆర్‌లో తగ్గిపోయిన నీటిమట్టం

కూడేరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం రోజురోజుకీ తగ్గిపోతోంది. దీంతో కుడికాలువకు నీరు త్వరలోనే బంద్ చేసే అవకాశం కనిపిస్తోంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటి రాక కూడా తగ్గిపోయింది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో నీటి మట్టం 432.200 మీటర్ల వద్ద, 3.595 టీఎంసీల నిల్వ ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా 3.650 టీఎంసీలు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి దాదాపు 1.800 టీఎంసీల నీరు పీఏబీఆర్‌లోకి వచ్చినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. కుడికాలువ కింద 37 చెరువులకు 4.157 టీఎంసీల నీటిని రెండున్నర నెలలపాటు అందించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన చెరువుల్లో నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. పాత నీటి నిల్వతో కలిపి ప్రస్తుతం 3.595 టీఎంసీల నిల్వ ఉంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లోకి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి వస్తున్న నీరు తగ్గిపోవడంతో ఇన్‌ఫ్లో దాదాపు పడిపోయింది. కుడి కాలువకు 700 క్యూసెక్కులు వదులుతుండడంతో నీటిమట్టం క్రమంగా తగ్గిపోతోంది. కాలువకు నీటి విడుదలను నిలిపివేసే అవకాశం కనిపిస్తోంది. వేసవి మొదలు కావడంతో పీఏబీఆర్‌లో ఏర్పాటు చేసిన నీలకంఠాపురం శ్రీరామిరెడి, సత్యసాయి, ఉరవకొండ నియోజకవర్గ తాగునీటి పథకాలతోపాటు అనంతపురం నగరానికి తాగునీటిని అందించేందుకు 3.500 టీఎంసీల నీరు నిల్వ చేయనున్నారు. దీంతో కుడి కాలువకు త్వరలోనే నీరు నిలిపి వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ఫోన్ ఇన్ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక రేడియో స్టేషన్‌లో గురువారం ఉదయం వైద్య, ఆరోగ్య సమస్యలపై ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాలు, మెడికల్ సర్టిఫికెట్ల జారీలో తలెత్తుతున్న సమస్యలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు ఇలా దాదాపు 15 మంది వరకు వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి కలెక్టర్ పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యలు తెలుసుకోవడానికే శాఖలవారీగా ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, పథకాలు, చట్టాల గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

తిమ్మమ్మ మర్రిమాను వద్ద అభివృద్ధికి అడుగులు

పర్యాటక శాఖాధికారుల పరిశీలన

నంబులపూలకుంట, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను, పరిసర ప్రాంతాలను పర్యాటక శాఖాధికారులు గురువారం పరిశీలించారు. జిల్లా పర్యాటక శాఖాధికారి జయకుమార్ బాబు మాట్లాడుతూ.. తిమ్మమ్మ మర్రిమాను వద్ద సమస్యలను గుర్తించి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలించేందుకు వచ్చామన్నారు. నివేదికలు తయారు చేసి, పంపనున్నట్లు చెప్పారు. మర్రిమాను చుట్టూ చేపడుతున్న రింగ్‌రోడ్డు పనులు అటవీ భూముల పరిధిలో ఉన్నాయన్నారు. ఉపాధి హామీ నిధులతో పనులు చేపట్టారన్నారు. అటవీ భూముల విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం తిమ్మమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం సంచాలకుడు ప్రతాప్‌రెడ్డి, ఏపీటీడీసీ డీఈ కుమార్, ఏఈ నారాయణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 12వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 67 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

15 మంది బిల్డర్లపై చార్జిషీట్

పుట్టపర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించిన బిల్డర్లు నోటీసులకు స్పందించకపోవడంతో 15 మందిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద గురువారం తెలిపారు. అక్రమ నిర్మాణాలపై 50మందికి గతంలో నోటీసులు ఇచ్చామన్నారు. కొంతమంది స్పందించారన్నారు. నోటీసుకు స్పందించని 15 మందిపై చార్జిషీట్ ఫైల్ చేశామన్నారు. మరికొంతమందికి నోటీసులు జారీ చేసి, గడువు ఇచ్చామన్నారు. వారు స్పందించకపోతే చార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

పోర్టుఫోలియో జడ్జిగా జస్టిస్ రామక్రిష్ణ ప్రసాద్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోర్టుఫోలియో జడ్జిగా జస్టిస్ గన్నమనేని రామక్రిష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలలకు గురువారం పోర్టుఫోలియో జడ్జిలను నియమించారు. అందులో భాగంగా జిల్లాకు జస్టిస్ రామక్రిష్ణ ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతి నిజమేనా..?

బీసీ సంక్షేమశాఖ అధికారి తీరుపై విచారణ

పుట్టపర్తిలో పర్యటించిన విచారణాధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి గురించి శుక్రవారం శాఖాపరమైన విచారణ జరిగింది. అ'ధన'పు బాధ్యతలు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని మంత్రి సవిత, ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ తీవ్రంగా పరిగణించారు. జాయింట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన గురువారం పుట్టపర్తిలో పర్యటించి, విచారించారు. ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో మధ్యాహ్నం విచారణ ప్రారంభించారు. ముందుగా ఆ జిల్లాలోని 28 మంది వార్డెన్లను పిలిపించారు. ఒక్కొక్క వార్డెన్‌తో విడివిడిగా మాట్లాడారు. ఆ అధికారిపై వచ్చిన ఆరోపణల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. ముడుపులను నగదు ఇచ్చారా..? ఆన్‌లైన్ లావాదేవీలు నడిపారా..? మధ్యవర్తి ద్వారా నడిపారా..? అని ప్రశ్నించినట్లు తెలిసింది. వార్డెన్లతో ఆ అధికారి వ్యవహరిస్తున్న తీరుపైనా ఆరా తీసినట్లు సమాచారం. అనంతరం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో ప్రశ్నించినట్లు తెలిసింది. మెజార్టీ వార్డెన్లు ఆ అధికారి తీరు గురించి కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. కొందరు కుల, విద్యార్థి సంఘాల నాయకులు సైతం విచారణ అధికారిని కలిసి.. ఆ అధికారిపై ఫిర్యాదు చేశారని తెలిసింది.

రెండు రోజుల్లో నివేదిక..

ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాం. వార్డెన్లతో వన్ టు వన్ మాట్లాడి వివరాలు నోట్ చేసుకున్నాం. విచారణకు వారు పూర్తిగా సహకరించారు. రాష్ట్ర డైరెక్టర్‌కు రెండు రోజుల్లో విచారణ నివేదికను అందజేస్తాను. డైరెక్టర్ తీసుకునే నిర్ణయాలను అమలు చేస్తాం.

-శ్రీధర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్, బీసీ సంక్షేమశాఖ

శ్మశానం మాదే..!

ఖననాన్ని అడ్డుకున్న వైసీపీ నాయకులు

రెండుగంటలపాటు వాగ్వాదం

ఇదే చివరి అవకాశం అంటూ హుకుం


మృతదేహాన్ని ఖననం చేయకుండా అడ్డుకున్న వైసీపీ నాయకులు

కుందుర్పి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలం తమదేనంటూ వైసీపీ నాయకులు తెరపైకి వచ్చారు. మండలంలోని కరిగానపల్లిలో మృతదేహాన్ని పూడ్చకుండా గురువారం అడ్డుకున్నారు. రెండు గంటలపాటు కుటుంబీకులు, బంధువులకు హెచ్చరికలతో హడలెత్తించారు. గ్రామానికి చెందిన మాల లక్ష్మీదేవి గురువారం మృతిచెందింది. కుటుంబీకులు, బంధువులు.. ఆమె దేహాన్ని ఖననం చేయడానికి గ్రామ సమీపానగల వంక ప్రాంతంలోకి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు స్థలం తమదంటూ రెండు గంటలపాటు మృతదేహాన్ని పూడ్చకుండా అడ్డుకున్నారు. లక్ష్మీదేవి కుటుంబీకులు తాము పూర్వం నుంచి ఇక్కడే మృతదేహాలను ఖననం చేస్తున్నామనీ, ఇప్పుడు అడ్డుపడడం ఏంటంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో వారు ఇదే చివరి అవకాశమనీ, ఇక్కడ ఇంకెవరినీ ఖననం చేయడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. శ్మశాన వాటికకు స్థలం, దారి చూపాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు వపోయారు. ఇప్పటికైనా అధికారులు శ్మశాన వాటికకు స్థలం చూపాలని వారు కోరుతున్నారు.

ఫిడెతో రోటరీ క్లబ్ ఒప్పందం



అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ క్రీడాకారుల్లో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా ఫిడె (ప్రపంచ చెస్ సమాఖ్య)తో రోటరీక్లబ్ ఒప్పందం చేసుకుంది. బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఫిడెకి చెందిన ఆండ్రే, రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా ప్రతినిధి నాగార్జున ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఇది జిల్లాలో చెస్ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని ఇరువర్గాల వారు అభిప్రాయపడ్డారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశం ఏర్పడుతుందని మొదటి రాయలసీమ ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ అభినందించారు.

ఒప్పందపత్రాన్ని చూపుతున్న ఫిడె, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆండ్రే, నాగార్జున

రాగిరి రామయ్య సస్పెన్షన్

గిరిజన మహిళతో అనుచిత ప్రవర్తన

చర్యలు తీసుకున్న డీఐజీ షిమోషి

అనంతపురం క్రైం, పుట్టపర్తి, మడకశిర టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గిరిజన యువతి పట్ల అనుచితంగా ప్రవర్తించినందుకు మడకశిర అప్‌గ్రేడ్ సీఐ రాగిరి రామయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు డీఐజీ షిమోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పొలం సరిహద్దుల విషయంలో గొడవపడ్డ బంధువులకు సర్దిచెప్పాలని మడకశిర పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తనతో సీఐ అనుచితంగా ప్రవర్తించారని మడకశిర మండలం టీడీ పల్లి తండాకు చెందిన గాయత్రి గత శనివారం శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎస్పీ, విచారణకు ఆదేశించారు. సీఐని వీఆర్‌కు పంపించారు. విచారణ నివేదిక అందిన తరువాత డీఐజీ ఆయనపై చర్యలు తీసుకున్నారు. కాగా, బాధితురాలితో కలిసి ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డీఐజీని గురువారం కలిశారు. సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గిరిజన మహిళను రాత్రి 10 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచుకున్నారని, వ్యక్తిగత విషయాలు ఆరా తీస్తూ మానసిక వేదనకు గురిచేశారని డీఐజీకి వివరించారు. అనంతరం బాధితురాలు మీడియాతో మాట్లాడారు. బంధువులతో వివాదం తలెత్తడంతో ఈ నెల 6న మడకశిర పోలీస్ స్టేషన్‌కు మధ్యవర్తితో కలిసి వెళ్లానని తెలిపారు. సీఐ తనను చాంబర్‌లోకి పిలుచుకుని, తలుపులు వేయమని చెప్పి వ్యక్తిగత విషయాలు అడిగారని ఆరోపించారు. 'మీ ఆయనకు ఎందుకు దూరంగా ఉన్నావు..? మళ్లీ పెళ్లి చేసుకోవాలనే ఆలోచన ఉందా..?' అని అడిగారని ఆరోపించారు. ఆయన తీరు తనకు ఇబ్బందిగా అనిపించిందని, తన బంధువులను పిలిపించకుండా, ప్రతిసారీ తననే ఎందుకు పిలిచి మాట్లాడుతున్నారని అడిగినా పట్టించుకోలేదని అన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


గొల్ల ప్రసాద్ మృతదేహం

గుత్తిరూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన గొల్ల ప్రసాద్ (70) జీవితంపై విరక్తి చెంది గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గొల్ల ప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో విషపు గుళికలు మింగాడు. బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

16న హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 16వ తేదీన ధర్మవరంలోని యశోద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సాకే శివశంకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. సీనియర్ బాలికలు, జూనియర్ బాలుర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 2005 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన బాలురు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు నెలాఖరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 8978137522, 7013572439 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణకు ఆహ్వానం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై శిక్షణకు అర్హులు హాజరు కావచ్చని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ తెలిపారు. రిటైర్డు బ్యూరోక్రాట్లు, రిటైర్డ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు (గెజిటెడ్ హోదా), 15 సంవత్సరాల పైబడి ఏదైనా రంగంలో పనిచేసిన వృత్తి నైపుణ్యులు (డాక్టర్లు, సామాజిక సేవకులు, విద్యావేత్తలు తదితరులు) అర్హులన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను తగిన ఆధారాలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థకు ఈనెల 15వతేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని సూచించారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.

సురక్షిత ఆన్‌లైన్ కార్యకలాపాలు సాగించాలి

జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీ సుదర్శన రావు

ఎస్పీతో కలిసి సైబర్ సురక్ష వాహనాలు ప్రారంభం


సురక్ష వాహనాలను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ఎస్పీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల బారిన పడకుండా కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్‌లో సురక్షితంగా ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు.. విద్యార్థులకు సూచించారు. జేఎన్టీయూలో సైబర్ సురక్ష (మన భద్రత-మన బాధ్యత) కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఎస్పీ జగదీశ్ అతిథులుగా హాజరయ్యారు. సైబర్ అవగాహన డిజిటల్ వాహనాలను వారు జెండా ఊని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో వీసీ మాట్లాడుతూ.. టెక్నాలజీతో ఆన్‌లైన్ సేవలు విస్తృతమయ్యాయన్నారు. రోజువారీ విధుల నుంచి మార్కెటింగ్ వరకు ఆన్‌లైన్ వినియోగం తప్పనిసరిగా మారిందన్నారు. దీనిని అదనుగా తీసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నరన్నారు. సాఫ్ట్‌వేర్లు, యాప్‌లను ఇన్‌స్టాల్ చేసేటపుడు వాటికి సెక్యూరిటీ ఉందో.. లేదో.. చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మెయిల్స్, అప్లికేషన్స్, యూపీఐ, బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డులు తదితరాలకు పిన్‌కోడ్‌లు ఎప్పటికప్పుడు మార్చుకోవాలని సూచించారు. మెజేజ్‌లు, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా వచ్చిన లింకులను క్షుణ్ణంగా పరిశీలించన తరువాతే ట్యాప్ చేయాలన్నారు. ఏమార్చితే వ్యక్తిగత సమాచారం మొత్తం నేరగాళ్లకు చేరిపోతుందని హెచ్చరించారు. ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా డిజిటల్ వాహనాలను రూపొందించామన్నారు. వాటి ద్వారా డిజిటల్ అరెస్టులు, సెల్‌ఫోన్ వినియోగం, ఫెడెక్స్, ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో, స్టాక్‌మార్కెట్, ఫేక్‌లోన్ యాప్స్ తదితర మోసాలపై ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. సైబర్ నేరాలపై www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, బ్యాంకు మేనేజర్లు రమేష్, నరసింగారావు, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జాకీర్ హుస్సేన్, ధరణికిషోర్, క్రాంతికుమార్, రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, శాంతిలాల్, సాయినాథ్ పాల్గొన్నారు.

మృతదేహాన్ని తప్పించబోయి కారు బోల్తా

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి ఆర్టీఓ చెక్‌పోస్టు సమీపాన 44వ జాతీయరహదారిపై గురువారం మహిళ మృతదేహాన్ని తప్పించబోయి గుట్టను ఢీకొని కారు బోల్తాపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భిక్షాటన చేసుకునే మహిళను బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తర్వాత మృతదేహంపై పలు వాహనాలు కూడా వెళ్లాయి. పెనుకొండకు చెందిన రాజు పాలసముద్రం వద్దకు కారులో వెళ్తూ రోడ్డుపై పడి ఉన్న మృతదేహాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న గుట్టను ఢీకొని, బోల్తాపడ్డాడు. ప్రమాదంలో రాజు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.

బిడ్డ పెళ్లికి రమ్మంటే.. కొడవలితో దాడి

భార్యపై భర్త ఘాతుకం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కుమార్తె వివాహానికి రావాలని ఆహ్వానించిన భార్యపై భర్త కొడవలితో దాడి చేశాడు. పరిగి మండలం బీచినాగపల్లిలో గురువారం నిర్మలపై భర్త కరియప్ప కొడవలితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. హిందూపురానికి చెందిన నిర్మలను 26 ఏళ్ల క్రితం బీచిగానపల్లి వాసి కరియప్పకిచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా నాలుగేళ్లుగా వేరుగా ఉంటున్నారు. నిర్మల పిల్లలతో కలిసి హిందూపురంలోనే ఉంటోంది. కరియప్ప బీచిగానపల్లిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో వీరి కుమార్తె అలేఖ్యకు పెళ్లి సంబంధం కుదిరింది. పెళ్లి పత్రికలు ఇచ్చి భర్తను ఆహ్వానించేందుకు నిర్మల గురువారం బీచిగానపల్లికి వెళ్లింది. కోపోద్రిక్తుడైన కరియప్ప భార్యపై కొడవలితో విచక్షణా రహితంగా దాడిచేశాడు. అతడు పరారయ్యాడు. నిర్మల మెడపై, తల భాగంలో, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే పడిపోయిన నిర్మలను బంధువులు ఆటోలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దాడులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వడదెబ్బతో యువకుడి మృతి

విడపనకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో వడదెబ్బతో శంకరప్ప (30) గురువారం మరణించాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వజ్రకరూరు మండలం పాత కడమలకుంట గ్రామానికి చెందిన శంకరప్ప (30) అమ్మమ్మ గ్రామమైన పాల్తూరులో గడ్డి వామి వేసేందుకు ఈనెల 12న వచ్చాడు. గురువారం ఉదయం నుంచి గడ్డివామి వేస్తూ నీరు తాగేందుకు కిందికి దిగాడు. వెంటనే కళ్లు తిరిగి స్పృహ తప్పి కింద పడిపోయాడు. బంధువులు తొలుత పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. శంకరప్పకు భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు.

పీహెచ్‌సీలో నిర్లక్ష్యంపై బంధువుల ఆగ్రహం

స్పృహ తప్పి పడిపోయిన శంకరప్పను తొలుత పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని(పీహెచ్‌సీ)కి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు బీపీ మాత్రమే పరిశీలించి, ఉరవకొండకు పంపారు. ప్రథమ చికిత్స కూడా చేయకుండా పంపించేశారని బంధువులు ఆరోపించారు. వారి నిర్లక్ష్యంతోనే శంకరప్ప మరణించాడని వారు ఆవేదన చెందారు.

ఎస్పీకి సైబర్ సెగ

ఎస్పీ పేరుతో ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు బాస్ ఎస్పీ జగదీశ్‌కీ సైబర్ సెగ తప్పలేదు. ఎస్పీ పేరుతో ఫేస్‌బుక్‌లో ఒకరు ఫేక్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఆ అకౌంట్ నుంచి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపారు. ఓ వ్యక్తికి ఐపీఎస్‌లు ఇలా పర్సనల్‌గా రిక్వెస్టులు ఎందుకు పెడతారన్న అనుమానం వచ్చింది. అందులో సంబంధంలేనివి ఉండటం అందుకు బలం చేకూరింది. వెంటనే పోలీసు అధికారులను సంప్రదిస్తే... అది ఫేక్ అని తెలిసింది. వెంటనే మెసెంజర్ ద్వారా ఫోన్ కాల్ చేశారు. నాలుగైదు సార్లు చేసినా లిఫ్ట్ చేయలేదట. కొంతసేపటికే ఆ అకౌంట్ ఫేస్‌బుక్‌లో కనిపించలేదట. ఫిర్యాదులు వెళ్తాయనే ఉద్దేశంతో సైబర్ నేరగాడు ఆ అకౌంట్‌ను క్లోజ్ చేసినట్లు తెలుస్తోంది. కాగా గతంలో డీఎస్పీలు, సీఐల పేరుతో ఫేక్ అకౌంట్లు క్రియేట్లు చేసి, వాటి నుంచి డబ్బు పంపాలని మెసేజ్‌లు పంపారు.

న్యూస్ బాక్స్

రేపు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ కళాశాలలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రజాగ్రీవెన్స్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పీఆర్ఓ ఎద్దుల సంతోష్‌రెడ్డి, మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి గురువారం తెలిపారు. ఇందులో అధికారులు పాల్గొంటారని, అమడగూరు, ఓడీసీ, నల్లమాడ మండలాలకు చెందిన ప్రజలు వారివారి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

● నల్లమాడ: ఓడీసీలోని ఐటీఐ కళాశాలలో శనివారం ప్రజాగ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండలకన్వీనర్ మైలే శివశంకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలో సమస్యలున్నవారు వినతులు అందచేయాలని కోరారు.

రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ రోడ్డుభద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి మోడల్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణం చేసేసమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలు మాన్యశ్రీ, హరివర్ధన్, జయశ్రీలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఆర్టీసీ డిపో సహాయ మేనేజర్ హరిత, గ్యారేజ్ ఇన్‌చార్జి విజయానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షురాలిగా పర్వీన్‌భాను



కదిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముస్లిం ఐక్య వేదిక కార్మిక సంఘం విభాగం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలుగా ఎన్.పర్వీనాభాను గురు వారం నియమించారు. తనను గౌరవాధ్యక్షు లుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు కలీల్ బాషా, ఇమామ్ షేక్‌కు ఆమె ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా వీరాంజనేయులు



ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుకుంటపల్లికి చెందిన ఇడగొట్టు వీరాంజనేయులును బీజేపీ మండలాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు జీఎం. శేఖర్ నియామక పత్రం గురువారం అందించారు. ఈయన గతంలో ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకుడిగా పనిచేశారు.

3న కలెక్టరేట్ వద్ద మహాధర్నా

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 3న కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ తెలిపారు. గురువారం స్థానిక నిజాం వలీ కాలనీలో అర్హులైనవారి నుంచి వినతిపత్రాలు స్వీకరించిన ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అర్హులైన ప్రతి ఒకరికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటిస్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తి అయిందని, ఇచ్చిన హామీని నిలపెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పవన్, లియాకత్, ఏఐటీయూసీ మధు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర పాల్గొన్నారు.

దాతలకు పరిటాల శ్రీరామ్ సన్మానం



దాతలను సన్మానిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో సీఎన్‌బీ ఫంక్షన్‌హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే జిల్లా స్థాయి సదస్సు గురువారం జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర నాయకుడు చిలకంమధుసూదన్ రెడ్డి, ఏపీయూ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీసుబ్బరావు, సత్యసాయి జిల్లా ఏపీ యూడబ్ల్యూజే కమిటీ సభ్యులు హాజరయ్యారు. వీరికి గొర్తిభారతి దేవి, గొర్తిసుధాకర్‌నాయుడు దంపతులు భోజన సదుపాయం కల్పించారు. దీంతో వారిని పరిటాలశ్రీరామ్, ఏపీయూ డబ్ల్యూజే నాయకులు సన్మానించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

ధర్మవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థి కట్టుబడి హేమంత్‌కుమార్ జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైనట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. హేమంత్‌కుమార్ మహారాష్ట్రలోని శివాజీ యూనివర్సిటీ కోల్హాపూర్‌లో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటారన్నారు. అతన్ని ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్, అధ్యాపకులు అభినందించారు.



హేమంత్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పూలకుంటపల్లిలో వైద్యశిబిరం

తనకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంటపల్లి గ్రామస్థులు జ్వరాల బారిన పడుతుండటంతో కొక్కంటి ప్రాథమిక వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు గురువారం ఆ గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిం చారు. వారి వెంట ఎంపీహెచ్ఈఓ ఓబులేసు, ఎంఎల్‌హెచ్‌పిఓ, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పూలకుంటపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

వైసీపీ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో ఆగిన నిర్మాణాలు





గాండ్లపెంట, దిన్నెమీదపల్లిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం

గాండ్లపెంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు రెండో విడత పనుల్లో భాగంగా ఐదు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు చేపట్టింది. గాండ్లపెంట, తాళ్లకాలువ, తూపల్లి, అరమడక వారి పల్లి, నల్లగుట్టతండా అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వివిధ స్థాయిలో నిలిచిపోయాయి. వాటికి సంబంధించిన సిమెంటు రాకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.15లక్షలు నిధులు విడుదల చేశారు. గత ప్రభుత్వం వీటి నిర్మాణాలకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం ఆ నిర్మాణాలు ఆగిపోయాయి.

● నంబులపూలకుంట: మండలంలోని దిన్నెమీదపల్లిలో అంగన్‌వాడీ భవన నిర్మాణం నిలిచిపోయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం రూ.7.20 లక్షల పంచాయతీ నిధులతో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టారు. రూ.3.70 లక్షల నిధులు మంజూరయ్యాయి. మిగిలిన నిధులు మంజూరుకాకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. దీంతో అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. దీనిపై కాంట్రాక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి డబ్బులు ఖర్చు చేశానని, తనకు బిల్లులు రావాల్సి ఉందని, ప్రస్తుతం పాత ధరలతో నిర్మాణం పూర్తి చేయలేమని అన్నారు. ఇప్పటికే భవనం మీద పెట్టిన పెట్టుబడికి వడ్డీలు కూడా కట్టలేకపోతున్నానని వాపోయారు.

కుణుతూరు జగనన్న ఇళ్ల పట్టాలపై విచారణ

వైసీపీ నాయకుడి వద్ద ఇళ్ల పట్టాలు ఉన్నాయని వాపోయిన లబ్ధిదారులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుణుతూరులో గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్‌లో అనర్హులకు పట్టాలిచ్చారనే ఆరోపణపై అధికారులు విచారణ చేపట్టారు. గురువారం బత్తలపల్లి డీటీ షణ్ముఖ ఆధ్వర్యంలో ఆర్ఐలు, సర్వేయర్లు, వీఆర్ఓలు ఆ లేఅవుట్‌కు వెళ్లారు. ఇళ్లపట్టాలను పరిశీలించారు. రికార్డుల ప్రకారం మొత్తం 163 మందికి అక్కడ పట్టాలిచ్చారు. అందులో 25 మంది పట్టాలను పరిశీలించి.. పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇక మిగిలిన వారిలో 25 మంది లబ్ధిదారులు పట్టాలు వైసీపీ నాయకుడి వద్దే ఉన్నాయని, తమకు ఇవ్వలేదని వాపోయారు. దీంతో వారు అధికారుల వద్ద నుంచే ఆ వైసీపీ నాయకుడి ఫోన్ చేశారు. రెండు రోజుల్లో పట్టాలు అందజేస్తానని ఆ వైసీపీ నాయకుడు సమాధనమిచ్చినట్లు లబ్ధిదారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రంలోగా పట్టాలు చూపాల్సిందేనని అధికారులు స్పష్టం చేయడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు.



లబ్ధిదారులను విచారిస్తున్న రెవెన్యూ అధికారులు



నేలకోట తండాలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి

సీసీ రోడ్లు, మినీ గోకులం ప్రారంభం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోట, నేలకోట తండా గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీగోకులాన్ని మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం రాత్రి ప్రారంభించారు. నేలకోట తండా రైతులు నందనాయక్, చిరంజీవినాయక్‌లకు చెందిన 4.60లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా రెండుగ్రామాల్లో ఉపాధిహామీ నిధులు రూ. 10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం నేలకోటలోని విలేజ్‌హెల్త్‌క్లినిక్‌ను పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు, ఎంపీడీఓ సాయిమనోహర్, పంచాయతీరాజ్ డీఈ శ్రీరాములు ఉన్నారు.

అక్రమ లేఅవుట్లలోని రాళ్ల తొలగింపు



అక్రమ లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

నంబులపూలకుంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అక్రమ లేఅవుట్లలోని రాళ్లను ఎంపీడీఓ అంజినప్ప, ఈఓఆర్డీ మాధవరెడ్డి గురువారం తొలగించారు. సర్వేనెంబర్ 275, 276, 277, 278, 561, 562, 563 భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా లేవుట్లు వేశారని, జీవో నెంబర్ 5 ప్రకారం ఆహుడా నుంచి అనుమతులు పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు పొందిన తరువాతనే ప్లాట్లు క్రయ, విక్రయాలు చేసుకోవాలని సూచించారు. పై సర్వే నంబర్లలో రిజిస్టర్లు చేయకూడదని కదిరి సబ్‌రిజిస్టర్ కార్యాలయానికి లేఖ పంపామన్నారు.

సజావుగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ, ఐసీడీఎస్ అధికారులు

ధర్మవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణంలో గురువారం అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు సజావుగా నిర్వహించారు. ధర్మవరం, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి ప్రాజెక్టులకు సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మూడు మండలాల నుంచి 161 దరఖాస్తులు రాగా 69 మందిని రిజెక్ట్ చేశామని, మిగిలిన 92 మందిలో 18 మంది ఇంటర్వ్యూలకు గైర్హాజర్ అయ్యారని, 74 మందికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించామని ఆర్డీఓ మహేష్ తెలిపారు. నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓలు లక్ష్మి, కవిత, సరస్వతి పాల్గొన్నారు.

రైతులందరూ గుర్తింపు కార్డు పొందాలి

నంబులపూలకుంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ రైతు విశిష్ట గుర్తింపు కార్డు పొందాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి గురువారం సూచించారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి విశిష్ట కార్డుకు నమోదు చేసుకోవాలని, గుర్తింపు కార్డు పొందిన రైతులు మాత్రమే ప్రభుత్వ పథకాలకు అర్హులని అన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల జిల్లాపరిషత్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు జగన్నాథం కర్రతో చితకబాదడంతో 8వ తరగతి చదువుతున్న చాణిక్య గురువారం తీవ్రంగా గాయపడ్డాడు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత చాణిక్య, ఇతర విద్యార్థులు పల్లెన్ని ఎండకు పెట్టి.. వెలుతురు గోడ మీద వేస్తూ.. ఆడుకోసాగారు. ఈ క్రమంలో ఆ పల్లెం మీద పడిన ఎండ.. పాఠశాల గదిలో ఉన్న ఉపాధ్యాయుడు జగన్నాథం కళ్ల మీద పడింది. దీంతో ఆగ్రహించిన ఆ ఉపాధ్యాయుడు కర్రతో చాణిక్యను కొట్టాడు. మోచేయి, వీపు, మెడ, తొడల వద్ద కొట్టడంతో వాతలు వచ్చి ఆ విద్యార్థి స్పృహ తప్పిపడిపోయాడు. తోటి విద్యార్థులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే వచ్చి విద్యార్థిని పక్కగ్రామమైన క్రిష్ణాపురం ఆసుపత్రికి తరలించారు. ఆగ్రహించిన గ్రామస్థులు మూకుమ్మడిగా ఆ పాఠశాల వద్దకు వెళ్లారు. అప్పటికే ఆ ఉపాధ్యాయుడు పాఠశాల నుంచి ఉడాయించినట్లు తెల్సింది. దీనిపై ఎంఈఓ గోపాల్ నాయక్‌ను అడగ్గా విషయం తన దృష్టికి ఆలస్యంగా వచ్చిందని, శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి విచారించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటానని తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఆ విద్యార్థి తండ్రి పెద్ద ఆంజనేయులు అనారోగ్యంతో మరణించాడు.

మౌలిక వసతులు కల్పించాలి



ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని పేదలు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఆ కాలనీ వాసులు, ఆర్పీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణంలోని సర్వే నెంబర్ 1778-1బిలో గత ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకున్నామని, నీరు, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించి, పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగన్న, సుగుణమ్మ, స్వప్న, అరుణ్, రాజు, వెంకటల క్ష్మమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌గా ప్రమోషన్ ఇవ్వాలని ధర్నా



చంటిబిడ్డతో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఆయా పరిమళ

ధర్మవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి): తనకు అంగన్‌వాడీ టీచ ర్‌గా ప్రమోషన్ ఇవ్వాలని స్థానిక శారదానగర్‌కి చెందిన ఆయా పరిమళ కోరారు. ఈ మేరకు తన చంటిబిడ్డతో సహా స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. తాను 11 ఏళ్లగా ఆయాగా పనిచేస్తున్నానని, శారదనగర్ అంగన్‌వాడీ సెంటర్ లో టీచర్ పోస్టు దాదాపు ఏడాదిగా ఖాళీగా ఉందని, తనకు టీచర్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా సీడీపీఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీనిపై సీడీపీఓ లక్ష్మీ స్పందిస్తూ ఆ అంగన్‌వాడీ టీచర్ పోస్టు విషయం కోర్టులో ఉందని, కోర్టు ఆదేశాల మేరకే చర్యలు తీసుకుంటామని అన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

ధర్మవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తాడి మర్రి మండలం మరువపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. మరువపల్లికి చెందిన 30 కుటుంబాలు అనంతపు రంలోని పరిటాల శ్రీరామ్ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ముళ్లకంపలు తొలగించండి

నల్లమాడ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి ఎద్దులవాండ్లపల్లి తండా మీదుగా పులగంపల్లి వరకు ఉన్న డబుల్ తార్ రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు, గడ్డి ఏపుగా పెరిగిపో యాయి. ఎద్దులవాండ్లపల్లి నుంచి పులగంపల్లి వరకు ప్రభుత్వం, ఆర్డీటీ సంస్థ చెట్లు నాటాయి. వీటితోపాటు గడ్డి, ముళ్లకంపలు ఏపుగా పెరగడంతో ఆకతాయిలు ఎవరైనా అగ్గి పుల్ల వేస్తే గడ్డితో పాటు చెట్లు కూడా కాలిపోయే ప్రమాదముంది. అలాగే చౌటకుంటపల్లి నుంచి దొన్నికోటకు వెళ్లే లింక్ రోడ్డుకు ఇరువైపుల కూడా గడ్డి ఏపుగా పెరిగింది. నల్లమాడ నుంచి గోపేపల్లి మీదుగా కదిరి వెళ్లే ప్రధాన రహదారి పక్కన కూడా గడ్డి ఏపుగా పెరిగింది. వేసవి మొదలైంది. ప్రయాణీకులు బీడీలు అట్టించుకుని అగ్గిపుల్ల వేస్తే ఎండిన గడ్డితో పాటు పచ్చని చెట్లూ ఆహుతయ్యే ప్రమాదముంది. అధికారులు స్పందించి గడ్డిని, ముళ్లకంపలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఎద్దులవాండ్లపల్లి తండా నుంచి పులగంపల్లి వెళ్లే రోడ్డు పక్కన భారీగా పెరిగిన కంపచెట్లు, గడ్డి

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్, డీటీకి గాయాలు



ఢీకొన్న కార్లు

కొత్తచెరువు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడప గానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ధర్మవరం రహదారిపై గురువారం రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో కొత్త చెరువు తహసీల్దార్ నీలకంఠారెడ్డి, ధర్మవరం డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ కుమార్ గాయపడ్డారు. పుట్టపర్తి నుంచి డిప్యూటీ తహసీల్దార్ ధర్మవరానికి, ధర్మవరం వైపు నుంచి కొత్తచెరు వుకు తహసీల్దార్ కార్లలో బయలుదేరారు. బస్సును ఓవర్‌టేక్ చేయబోయి.. ఈ రెం డు కార్లు ఎదురుగా ఢీకొన్నాయి. తహసీల్దార్ నీలకంఠారెడ్డి తలకు, డీటీ సురేశ్ కుమార్‌కు గాయాలయ్యాయి. వారిని అనంతపురానికి తరలించారు. తహసీల్దార్, డీటీని ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

మామిడి తోటకు నిప్పు



కాలిపోయిన మామిడి మొక్కలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాపురం గ్రామ సమీపంలో మామిడితోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 250 మామిడిమొక్కలు కాలిపోయినట్లు బాధిత రైతు ఓబిరెడ్డి వాపోయాడు. నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి హామీ పథకం కింద ఐదు ఎకరాల్లో ఈ మొక్కలు నాటానని, ప్రతి నెలా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించానని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం కంచెకు నిప్పుపెట్టడంతో మంటలు తోటంతా వ్యాపించి మొక్కలు కాలిపోయాయని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి మొక్కలు మరళా అందించాలని కోరారు. దీనిపై పోలీసులు, ఉపాధి హామీ అధికారులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానని రైతు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

నల్లమాడ, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): కదిరి రూరల్ పరిధి కట్టెల తండాకు చెందిన ఓ వ్యక్తి నాటుసారాను తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి గురువారం తెలిపారు. అతడు ద్విచక్రవాహనంలో 20 లీటర్ల నాటుసారాను తరలిస్తుం డగా... స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాన్ని, సారాను స్వాధీనం చేసుకొని.. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధి ఆరోపణపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీడీ రమేష్‌బాబు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పునడింపల్లిలో ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది హరిపై వచ్చిన ఆరోపణపై గురువారం విచారణ చేపట్టారు. హరి గతంలో ఆ గ్రామంలో పనిచేస్తున్న వలటీర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉపాధి పనులు చేసినట్లు బిల్లులు మంజూరు చేశా రని, దీనిపై ఈ గ్రామానికి చెందిన మధుసూధన్‌రెడ్డి సోమవారం మండల కేంద్రలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారని ఏపీడీ రమేష్‌బాబు తెలిపారు. ఆ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ఇద్దరు వలంటీర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తకు అక్రమంగా బిల్లులు మంజూరు చేసినట్లు విచారణలో వెల్లడైందని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఆంజనప్ప, ఏపీఓ చంద్రశేఖర్, ఈసీ రమేష్ ఉన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన కల్పించండి

నల్లచెరువు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలని గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కల్పనారెడ్డి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన లీగల్ సెల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీలు ఇంటింటి సర్వే చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా, ఏఓ రామక్రిష్ణ, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సచివాలయ ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ గ్రూపు సభ్యులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

● నక్కలగుట్ట కాలనీ సమీపంలో అక్రమ తవ్వకాలు
● రోజూ 50కి పైగా ట్రాక్టర్ల మట్టి తరలింపు
● పట్టించుకోని అధికారులు



నక్కలగుట్ట వద్ద మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

సోమందేపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టిమాఫియా రెచ్చిపోతోంది. కూటమి ప్రభుత్వం నాయకుల పేర్లు చెప్పి ఎక్కడబడితే అక్కడ తవ్వకాలు చేసి కొందరు స్వార్థపరులు జేబులు నింపుకుంటున్నారు. కొండలు, గుట్టలు, చెరువులు, ఆఖరికి ప్రభుత్వ భూముల్లో సైతం ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టిని యథేచ్ఛగా తవ్వి లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. వీరిని అడ్డుకునే నాథుడే కరువయ్యారు.

మండల కేంద్రంలోని లేఅవుట్లకు, గృహాల బేస్‌మెంట్లకు వాణిజ్య సముదాయాల నిర్మాణానికి మట్టి అవసరం ఎంతో ఉంటుంది. మట్టికి ఉన్న ఈ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా దందా కొనసాగిస్తున్నారు. ఓ ప్రముఖ నాయకుడి అండదండలతో బుధవారం నక్కలగుట్ట కాలనీ సమీపంలోని హంద్రీనీవా కాలువ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జరిపి మట్టిని తరలించారు. అదేవిధంగా కాస్త దూరంలో ఉన్న మరో ప్రాంతంలో కూడా గుట్టను తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ ధర రూ.700 పలుకుతుండటంతో ప్రతిరోజూ 50కి పైగా ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌కవేటరు డ్రైవర్‌ను ఎవరి కోసం మట్టి తరలిస్తున్నారని అడగ్గా అతడు ఓ ప్రముఖ నాయకుడి పేరు చెప్పడం గమనార్హం. గతంలో సైతం అక్కమ్మగార్ల కొండవద్ద చెన్నాపురం గుట్టల్లో, సోమందేపల్లి చెరువులో అలాగే నల్లొండరాయనపల్లి క్వారీ సమపంలో యథేచ్ఛగా తవ్వి మట్టిని తరలించడం విదితమే. గతంలో చాలకూరువద్ద చెరువు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించినా అనంతరం ఎటువంటి చర్య లేకుండా వదిలేశారు. ఇంత జరుగుతున్నా సంబంధితశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ఇంతవరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకున్న పాపానపోలేదని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మట్టిమాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఇసుకకులాగా, మట్టికి కూడా అనుమతులు మంజూరు చేస్తే ఈ సమస్య కొంతవరకూ తీరుతుంది. లేకుంటే మట్టే బంగారంలాగా మారిపోయే ప్రమాదం కన్పిస్తోంది.

దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా తాము ఎవరికి అనుమతి ఇవ్వలేదన్నారు. అలాగే అనుమతి కోసం ఎవరూ తమను సంప్రదించలేదన్నారు. వీఆర్‌ఓను సంఘటనా స్థలానికి పంపించి ఎవరు మట్టి తరలిస్తున్నారో వారిపై సత్వర చర్యలు చేపడతామన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని తెలిపారు.

అక్రమార్కులు చెలరేగిపోతున్నారు



బాలస్వామి, సీపీఐ కార్యదర్శి

మండలంలో మట్టిమాఫియా చెలరేగిపోతోంది. గతంలో అక్రమార్కులను సీపీఐ తరఫున పలుమార్లు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా మట్టిని తరలిస్తూనే ఉన్నారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే త్వరలో పార్టీ తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

ఎన్నాళ్లీ యానాదుల దైన్యం?

నేటికీ గుడిసెల్లోనే నివాసముంటున్న వైనం



ఎల్లోటి గ్రామ పొలాల్లో ఉన్న యానాదుల గుడిసెలు



తమకు ఇచ్చిన ఆధార్ కార్డులను చూపుతున్న కుటుంబ పెద్దలు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో అత్యంత నిరుపేదలుగా ఉన్న ఎస్టీ వర్గంలోని యానాదిఐ సామాజిక వర్గం చాల మందికి నేటికీ సొంత ఇళ్లులేక గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఇళ్లులేక వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు వారికి అందడంలేదు. మండలంలోని ఎల్లోటీ గ్రామంలో పది కుటుంబాలవారు 15ఏళ్లుగా గ్రామ సమీపంలోని పొలాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వారి పిల్లలు ఎల్లోటి పాఠశాలలో చదువుతున్నారు. నేటికీ వారికి సొంత ఇళ్లులేక గుడిసెల్లో దుర్భర జీవితం గడుపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం వారి బాధలను, దుస్థితిని చూసి వారికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరుచేసిం. తీరా వారికి ఇళ్లు మంజూరుచేసే సమయంలో ప్రభుత్వం మారడంతో వారి పరిస్థితి నేటికి గుడిసెల్లోనే కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గృహాలు మంజూరుచేయాలని వారు కోరుతున్నారు.

లో ఓల్టేజీతో కాలిపోతున్న మోటార్లు

● విద్యుత్ సమస్యతో అల్లాడుతున్న రైతులు
● సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు



కాలిపోయిన మోటార్లతో ధర్నా చేస్తున్న హెచ్‌డీ హళ్లి రైతులు

అగళి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో బోరుబావులకు బిగించిన మోటార్లు లోవోల్టేజి విద్యుత్ సమస్యతో కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రాస్తారోకోలు, ధర్నాలు చేపడుతున్నారు. అగళి మండల వ్యాప్తంగా హెచ్‌డిహళ్లి, మధుడి, అగళి సబ్‌స్టేషన్ల ముందు రైతులు విద్యుత్ సక్రమంగా సరఫరా చేయడంలేదని గతనెల రోజుల నుంచి ధర్నా చేస్తూనే ఉన్నారు. అయినా అధికారులు తూతూమంత్రంగా ఏదోచెప్పి వెళ్లిపోతున్నారేగాని సమస్య పరిష్కరించడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి హెచ్‌డిహళ్లి, పి బ్యాడిగెర గ్రామ పంచాయతీలలోని రైతుల బోరుబావులకు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఒకే సబ్‌స్టేషన్ నుంచి ఇరిగేపల్లి, అగళి, పిబ్యాడిగెర, హెచ్‌హళ్లి గ్రామాల రైతుల బోరుబావులకు విద్యుత్ సరఫరా కావాలంటే తీవ్రఅంతరాయం జరుగుతోంది. ఇందుకు నిరసనగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ముందు రాస్తారోకోలు చేస్తున్నారు. డీఈ, ఏడీ, ఏఈలు వచ్చి రైతులకు ఉత్తుత్తి సలహాలు ఇచ్చి పోతున్నారేతప్ప పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. అగళి మండలానికి 32కేవీ ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా హెచ్‌డిహళ్లి గ్రామ రైతు హనుమంతరాయప్ప మాట్లాడుతూ రోజుకి ఐదారుగంటలు కూడా విద్యుత్ సరఫరా కావడంలేదని దీంతో పాటు లోవోల్టేజి సమస్య అధికంగా ఉందని మోటార్లు కూడా కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వాలు మారినా రోడ్డు మారలేదు



బాలంపల్లి క్రాస్‌లో ఏర్పడిన పెద్దగుంత

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏ దేశమైనా దాని నాగరికత ఆ ప్రాంత భవనాలు, రోడ్లపై ఆధారపడి ఉంటుందంటారు. అయితే హిందూపురం మండలం శివారు గ్రామమైన బాలంపల్లి క్రాస్ వద్ద ఏళ్ళ తరబడి పెద్దపాటి గుంత ఏర్పడింది. వందలాది ద్విచక్రవాహనాలు, బస్సులు, లారీలు, కార్లు ఈ రోడ్డు దాటుకుంటూ వెళ్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి ఏళ్ళ తరబడి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పట్టణానికి దూరంగా ఉండటంతో ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. గ్రామ పంచాయితీ వారు కూడా పట్టించుకోలేదు. ఆర్‌అండ్‌బి అధికారులు అయితే పూర్తి నిర్లక్ష్యంగా ఉన్నారు. అధిక లోడుతో పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు యాక్సిల్ విరిగి వాహనం రోడ్డుపై నిలబడిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కనీసం మట్టి వేసి అయినా రోడ్డు మరమ్మతు చేపట్టాలనే ఆలోచన కూడా ఆర్‌అండ్‌బి అధికారులకు లేకపోవడం శోచనీయం.

అధికారులకు మద్దతుగా స్వచ్ఛంద సంస్థలు

పావగడ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు నాలుగు రోజుల నుంచి చేపట్టిన నిరాహార దీక్షకు పావగడ పట్టణంలోని పలు స్వచ్ఛంద సేవాసంస్థల నాయకులు గురువారం మద్దతు తెలిపారు. గ్రామ కార్యదర్శులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గతేడాదే ధర్నా చేపట్టినా వాటిని త్వరలో పరిష్కరిస్తామని రెవెన్యూ మంత్రి కృష్ణ భైరగౌడ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఆ సమస్యలు పరిష్కరించలేదు. రెవెన్యూ కార్యదర్శులు ధర్నాలో పాల్గొంటే సామాన్య ప్రజలు, రైతుల పరిస్థితి ఎలా ఉంటుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప ఆందోళన వ్యక్తం చేశారు.

పాఠశాల సమయాల్లో మార్పు సరికాదు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పాఠశాల సముదాయాల సమయాల్లో మార్పు సరికాదని, గతంలో నిర్వహించిన విధంగానే నిర్వహించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మారుతీప్రసాద్, ప్రధానకార్యదర్శి జయకృష్ణ. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల సముదాయాల సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11.45 నిమిషాలకు పాఠశాలలో తరగతులు నిర్వహించి మధ్యాహ్న భోజనం వడ్డించి అనంతరం సమావేశాలకు హాజరుకావాలని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. దూరప్రాంతాల్లో ఉన్న వారు క్లస్టర్ పాఠశాలలకు సమావేశానికి హాజరు కావడం సులభతరం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలని వారు కోరారు.

బొమ్మగుండనహళ్లిలో పొలం పిలుస్తోంది



పొలం పిలుస్తోందిలో పాల్గొన్న అధికారులు, గ్రామస్థులు

రొళ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మగుండనహళ్లి గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. రైతులు తమ యునీక్ ఐడీని నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలకు ఖచ్చితంగా రైతులు తమ యూనిక్ ఐడీ తెలపాలని, పి.ఎం.కిసాన్, పంటలబీమా, పంట నష్టపరిహారం, వ్యవసాయయాంత్రీకరణ, మల్బరీషెడ్, డ్రిప్, పండ్లతోటల పెంపకం తదితర వాటికి ఐడీ తప్పనిసరి అన్నారు. నెలాఖరులోపు రైతులు పాసుపుస్తకం, ఆధార్ లింక్‌అయిన ఫోన్‌నెంబర్ తీసుకొని ఆర్‌ఎస్‌కె సిబ్బందిని కలిసి రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజ్యలక్ష్మీ, ఏఈఓ చంద్రకళ, సెరీకల్చర్ అధికారి జయరాం, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సైన్స్ దినోత్సవం



సైన్స్ దినోత్సవంలో విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలను నిర్వహించామన్నారు. చిత్రలేఖనంపోటీలో 25పాఠశాలల నుంచి 30మంది విద్యార్థులు, సంగీత పోటీల్లో 15మంది పాల్గొన్నారన్నారు. 17న వ్యాసరచన పోటీలు, 21న క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెం పొందిస్తూ సైన్స్‌పట్ల ఆసక్తి నింపడానికి, ఉపాధ్యాయులలో ఉత్సాహాన్ని నింపడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

అంగరంగ వైభవంగా చౌడమ్మ జాతర

పరిగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకూరులో గ్రామదేవత చౌడమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. మొక్కుబడులు ఉన్న భక్తాదులు నార్జాలతో తమభక్తిని చాటుకున్నారు. గ్రామ మహిళలు జ్యోతులు మోస్తూ గ్రామమంతా ఊరేగింపుగా తిరిగి అమ్మవారికి సమర్పించారు. చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, ఈశ్వరయ్య, అంగడిరాము, చౌడప్ప పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 54 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ

గోరంట్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిడాప్ ఆధ్వర్యంలో గోరంట్లలోని ఎఎన్‌కె డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన జాబ్‌మేళాలో 54మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈమేళాకు ఆరు కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా 137మంది యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. వారిలో 54మందికి ఉద్యోగాలివ్వడానికి సుముఖత వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎపిఎస్, ఎయిడెడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ పాల్గొన్నారన్నారు.

యూనిక్ నంబర్‌తో రైతులకు లబ్ధి: ఏఓ

మడకశిర రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): భూములున్న రైతులకు యూనిక్ ఐడీ నెంబరుతో వెంటనే లబ్ధి పొందవచ్చని వ్యవసాయఅధికారి తిమ్మప్ప తెలిపారు. ప్రతి రైతు తప్పనిసారిగా యూనిక్ ఐడి నెంబర్ చేయించుకోవాలన్నారు. దీని వల్ల రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, పంట రుణాలపై వడ్డీరాయితీ సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. రైతులు పట్టాదారుపాసుపుస్తకాలు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబరుతో సమీప రైతు సేవా కేంద్రానికి వెళ్ళి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి నిధుల మంజూరు

● దళిత నాయకుల హర్షం

అమరాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు భాగంలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం పట్ల దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కృషితో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.17లక్షలు మంజూరు చేయడంతో మండలంలోని ఉన్నటువంటి దళిత నాయకులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి: డీఎస్పీ

హిందూపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): హిందూపురం సబ్‌డివిజన్‌లోని పట్టణాలతోపాటు పల్లెల్లో సైతం ప్రతి ఇంటికీ సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఏదైనా సమస్య జరిగినప్పుడు న్యాయం చేయవచ్చునన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకుని ప్రతిఇంటికి సీసీకెమెరా ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. ముఖ్యంగా కొంతమంది కోట్లాది రూపాయిలు ఖర్చుపెట్టి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, కానీ సీసీకెమెరా పెట్టుకోలేకపోతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందరి చేతుల్లోనూ స్మార్ట్‌ఫోన్ ఉంటున్నాయని, అలాంటపుడు ఇంటికి నాలుగు కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎంతో మంచిదన్నారు. సిసి కెమెరాలు ఉండటంవల్ల నేరాలు చేయడానికి జంకుతారన్నారు. పట్టణంలోని ప్రతిషాపులోనూ రోడ్డు కనబడే విధంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకున్నవారు సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ కార్యవర్గం ఎన్నిక



ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గ సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా అధ్యక్షుడు ఈరేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పరిటాల డిగ్రీకళాశాలలో నిర్వహించిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా హరి, కార్యదర్శిగా అర్జున్‌తోపాటు ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం డిగ్రీ కళాశాలలో రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్న జిమ్, స్పోర్ట్ రూమ్‌ను తెరిపించి వైస్ ప్రిన్సిపాల్ జయప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాసామగ్రి అందించారు.

కెంచమాంబ దేవి విగ్రహ ప్రతిష్ఠ



అమరాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌడనకుంట గ్రామంలో కెంచమాంబ నూతన దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల కన్వీనర్ గణేష్, లక్ష్మీనారాయణ, కార్యదర్శులు జయరామప్ప, రంగేగౌడ్, మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతితోనే ఇసుకను తోలుకోవాలి

అగళి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతితోనే సువర్ణముఖి నది నుంచి ఇసుకను తోలుకోవాలని తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రజలకు సువర్ణముఖి నది నుంచి ఇసుకను తోలుకోవాలంటే గ్రామ సచివాలయంలో తగిన రుసుము చెల్లించి రసీదును తీసుకోవాలన్నారు. అలా కాకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజలు అక్రమంగా ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యజమానులు దీనిని గమనించాలన్నారు. ఎప్పటికప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారులు పర్యటిస్తూనే ఉంటారన్నారు. అలాంటి సమయంలో దొరికినవారు శిక్షార్హులవుతారన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బహుజన చైతన్యవేదిక సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ బహుజన చైతన్యవేదిక సభ్యులు మంత్రి సవితకు గురువారం వినతిపత్రం అందించారు. వేదిక వ్యవస్థాపకుడు శివరామక్రిష్ణ, కమిటీ సభ్యులు మంత్రికి వినతిపత్రం అందిస్తూ గతంలో పెనుకొండ పట్టణంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి 50సెంట్ల భూమిని కేటాయించారన్నారు. దీనిపై స్పందించిన మంత్రి ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీల సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని ఎస్టీ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకుందని నూతన కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన నిధులుకేటాయిస్తానని అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి సాంఘిక సంక్షేమ అధికారులతో మాట్లాడాల్సిందిగా వారికి సూచించారు.

గ్రంథాలయం తనిఖీ

మడకశిర టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మడకశిర గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి టి.రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాల వివరాలు, ప్రస్తుతం అవసరమైన వాటి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పాఠకులకు ఎలాంటి పుస్తకాలు అవసరమవుతాయనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

హేమావతిలో ముందస్తు ఏర్పాట్లు

అమరాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగిస్తూ గుంతలను పూడ్చడం మొదలుపెట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చినటువంటి భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, స్థానిక సర్పంచి తిప్పేస్వామి, ఆలయ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ కమిటీ ఎన్నిక

పెనుకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ నూతన విద్యాకమిటీని జిల్లా అధ్యక్షుడు రొద్దం శివకుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కైఫ్, కార్యదర్శిగా నందకిషోర్, ఉపాధ్యక్షులుగా జశ్వంత్, ఆసిఫ్, అనీల్, శ్రీహరి, సహాయకార్యదర్శులుగా జనార్దన్, ప్రశాంత్‌రెడ్డి, అస్లం, ఆదిల్, కమలాకర్‌తో పాటు 11మంది సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు పెనుకొండ మండల సర్వసభ్య సమావేశం

పెనుకొండ మండలం ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11గంటలకు మండల అధ్యక్షురాలు గీత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు.

ఫాంహౌస్ యజమానిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



ప్రభుత్వ భూమిలో 40 అడుగుల రోడ్డుకోసం తవ్విన దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గలిబిపల్లి గ్రామ పొలిమేర్లలో ఓ భూస్వామి తన ఫామ్‌హౌస్ వరకు రోడ్డు వేసేందుకు సిద్ధమయ్యాడు. అయితే గలిబిపల్లి నుంచి ఈ ఫామ్‌హౌస్ వరకు రైతులకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూముల్లో 40అడుగుల దారి ఉందంటూ రైతులను భయపెట్టి పనులు ప్రారంభించారు. రాత్రి సమయంలో పనులు ప్రారంభిస్తుండటంతో రైతులు అడ్డుకుని పనులు నిలిపివేశారు. గురువారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మీకి గలిబిపల్లి గ్రామస్థులు రోడ్డు పనులు నిలిపివేయాలని వినతిపత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ స్కెచ్‌లో రహదారి లేకపోతే పనులు వెంటనే నిలిపివేయాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేఫ్‌లో చోరీ



చోరీ జరిగింది ఈ కేఫ్‌లోనే

హిందూపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణ ఆర్పీజీటీ రోడ్డులో గల వెంకటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని డెక్కన్ చాయ్ కేఫ్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగిందని బాధితుడు సమీవుల్లా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం రాత్రి పొద్దుపోయాక గుర్తుతెలియని దుండగులు బయటున్న సీసీ కెమెరాలను పక్కకు తిప్పి డోర్ బీగాలు పగలకొట్టి డ్రాలోని నగదుతోపాటు, సిగరెట్లు ఎత్తుకెళ్లారన్నారు. వీటి విలువ సుమారు రూ.55వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేకాక సీసీకెమెరాల్లోని మెమోరికార్డులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు తెలిపారు. దీనిపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.